క్లుప్తంగా

ఆర్‌జేడీపై దాడి హేయమైన చర్య

– ఖండించిన ఎస్టీఎఫ్ సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్యంలో సమస్యలేమైనా ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకోవాలే తప్ప నిరాధార ఆరోపణలతో భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్(ఎస్టీఎఫ్) రాష్ట్ర ప్రెసిడెంట్ రామాంజనేయులు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తుపాకుల మురళీ అన్నారు. పాఠశాల విద్య ఆర్‌జేడీ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిపై అనంతపురంలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వారు పేర్కొన్నారు. దీంతోపాటు ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డికి పోలీసుశాఖ రక్షణ కల్పించాలని వారు విన్నవించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శివభారత్‌రెడ్డి

కడప కార్పొరేషన్: మహాశివరాత్రి పండుగ సందర్భంగా నగరంలోని పాతకడపలో గ్రామంలో రాగిచెట్టు మల్లేశ్వరి దేవస్థానం వారి ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శనివారం డా. గోసుల శివభారత్‌రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీల్లో మైదుకూరు మండలం కోతిరెడ్డిపాడుకు చెందిన ఎద్దు మొదటి స్థానంలో, ద్వితీయ స్థానంలో రాసినాయనపల్లెకు చెందిన ఎద్దు, మూడో స్థానంలో పాతకడపకు చెందిన ఎద్దు నిలిచాయి.

దర్గా స్థలాన్ని కాపాడాలి

కడప రూరల్: కడప నగరంలోని రఖీబ్‌షావలీ దర్గా స్థలాన్ని కాపాడాలని అఖిలపక్ష నేతలు చంద్ర, అమీర్‌బాబు, రవిశంకర్‌రెడ్డి, సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. పూర్వాపరాలను పరిశీలించి రఖీబ్‌షావలీ దర్గా స్థలాన్ని కాపాడాలని కోరారు. ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకట శివ, మగ్బూల్, మైనుద్దీన్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

దూదేకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

కడప రూరల్ : దూదేకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా తెలిపారు. శనివారం స్థానిక ఆ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక విప్లవకారుడని తెలిపారు. ఆయన ప్రోత్సాహంతోనే బీసీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత లభిస్తోందన్నారు. అలాగే దూదేకులకు కూడా రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూరు కుళ్లాయప్ప, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పాపాసాబ్ పాల్గొన్నారు.

వైవీ రావుకు నివాళి

ప్రొద్దుటూరు : ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు మృతి తీరని లోటని ఏపీటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు ఎన్నార్ శేఖర్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శనివారం వైవీ రావు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. డిపో సెక్రటరీ బీసీ శేఖర్, బీవీ రమణ, శేఖర్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : మండలంలోని ఆటోనగర్‌లోకు చెందిన వి.రామకృష్ణ (45) అనే వ్యక్తి అనారోగ్యంతో చనిపోయాడు. అతనికి బంధువులు ఎవరు లేకపోవడంతో మే ఐహెల్ప్‌యూ ఫౌండేషన్‌కు స్థానికులు సమాచారం ఇచ్చారు. వారు స్పందించి హిందూ శ్మశాన వాటికలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్‌రావు, సీఈఓ మల్లికార్జున, కామనూరు శివసాయినాథ్, తాళ్లమాపురం కానిస్టేబుల్ భాస్కర్, అనీఫ్, సుబహాన్, సుబ్బయ్య పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలను ప్రారంభించిన భాస్కరరెడ్డి



పులివెందుల రూరల్ : మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని మోట్నూతలపల్లెలో శనివారం నిర్వహించిన బండలాగుడు పోటీలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. పులివెందుల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి 8 జతల ఎద్దులు ఈ పోటీలలో పాల్గొన్నాయి. గెలుపొందిన విజేతలకు వైఎస్ భాస్కర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బయపురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబుళరెడ్డి, వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హర హర మహాదేవ!

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి
- శివాలయాల్లో ఘనంగా పూజలు



హౌసింగ్‌బోర్డు కోదండ రామాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



వధూవరులుగా స్వామి , అమ్మవారు



పూజలందుకుంటున్న శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి



కనుమలోపల్లె శివాలయంలో కల్యాణమూర్తులుగా శివపార్వతులు



ఊటుకూరు గ్రామంలో ప్రత్యేక పూజలందుకున్న శివుడు

కడప కల్చరల్ : మహాశివరాత్రి పర్వదినాన్ని శనివారం నగర వాసులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి కుటుంబాలతో కలిసి శివాలయాలకు వెళ్లారు. విశేష అభిషేకాల అనంతరం 5 గంటల తర్వాత భక్తులను దర్శనాలకు అనుమతించారు. జిల్లాలోని పురాతన ఆలయాలలో ఒకటైన దేవునికడప శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో ఎప్పుడూ లేని విధంగా భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండి స్వామిని దర్శించుకున్నారు. మోచంపేట ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయం, గడ్డిబజారు సోమసుందరేశ్వరస్వామి ఆలయాలలో కూడా భక్తులు పెద్ద సంఖ్యలో కనిపించారు. నబీకోట మల్లికార్జున, సర్వమంగళాదేవి ఆలయం, మృత్యుంజయకుంట శివాలయం, ప్రకాశ్‌నగర్‌లోని అమరేశ్వరస్వామి ఆలయం, మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం, ఇంకా హౌసింగ్‌బోర్డులోని శివాలయాలు, సీపీ బ్రౌన్, మారుతీనగర్, రవీంద్రనగర్ తదితర శివాలయాల్లో లింగాష్టకం, బిల్వపత్ర పూజలు, రుద్రహోమాలు నిర్వహించారు. స్థానిక చెన్నైరోడ్డులోని సెంట్రల్ జైలు వద్ద గల శ్రీ సర్వేశ్వర మహర్షి ఆశ్రమంలో మహా శివునికి రుద్రాభిషేకం, విశేష పూజలు, శ్రీ రాజరాజేశ్వరీ దేవికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆశ్రమ సేవా సమితి అధ్యక్షులు ఎస్.రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసమూర్తి, రంగనాయకులు, ఉమామహేశ్వరరావు, కె.రఘునాథ్ తదితర ప్రముఖులు, సప్తగిరి నగర్ వాసులు పాల్గొన్నారు. బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎంఎస్ కొట్టాలలోని శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామికి విశేష అలంకారం, పూజలు నిర్వహించారు. డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రముఖులు డీఏ కార్తీక్‌రెడ్డి, భరత్, పురుషోత్తం, కె.చంద్రమౌళిరెడ్డి, ఫుడ్ టీం సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలు

నగరంలోని దాదాపు అన్ని శివాలయాల్లోనూ స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. కొన్నిచోట్ల ఉదయం 10 గంటల నుంచి, మరికొన్నిచోట్ల సాయంత్రం 4 నుంచి, ఇంకొన్నిచోట్ల రాత్రి 7, ఆపైన కూడా కల్యాణోత్సవాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే రాత్రి 12 గంటల నుంచి అన్ని ఆలయాల్లోనూ శివరాత్రి లింగోద్భవ సమయంలో మాత్రమే ప్రత్యేకంగా నిర్వహించే మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని దాదాపు మూడున్నర గంటల నుంచి నాలుగు గంటలసేపు నిరంతరాయంగా నిర్వహించారు.

జాగరణలు: శివరాత్రి నాడు శివపూజలు చేసినా, శివనామ స్మరణ చేసినా, శివనామం విన్నా ముక్తి లభిస్తుందన్న విశ్వాసం లభిస్తుండడంతో పలువురు భక్తులు శివాలయాల్లో జాగరణలు చేశారు. ఈ సందర్భంగా హరికథలతో శివపురాణాన్ని నిర్వహించారు. మరికొన్నిచోట్ల సంగీత కచేరీలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించారు.

శ్రీ విజయదుర్గాలయంలో విశేష పూజలు

శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో శనివారం శివరాత్రి పండుగ సందర్భంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. శనిత్రయోదశి శివరాత్రితో కలిసి రావడంతో నవగ్రహ మండపంలో శనీశ్వరస్వామికి తైలాభిషేకం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గా ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బ్రహ్మకుమారీల శివరాత్రి ఉత్సవం

బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కడప నగర ప్రధానశాఖ కార్యాలయంలో శనివారం శివరాత్రి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా ఇన్‌ఛార్జి బీకే గీతా అక్కయ్య ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు, ఆర్‌జేడీ రవి, రిమ్స్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిప్రీతి, డాక్టర్ అభిలాష్, డాక్టర్ తేజస్విల ఆధ్వర్యంలో శివధ్వజం ఎగురవేసి శివజ్యోతిని వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు చేస్తున్న సేవల గురించి ఆంధ్ర, కర్ణాటక అడిషనల్ జోన్ ఇన్‌ఛార్జి గీతా బెహన్ వివరించారు. శివరాత్రి రహస్యాన్ని వివరించారు. పలువురు బ్రహ్మకుమారీలు, బ్రహ్మకుమారులు, ధ్యానులు పాల్గొన్నారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణంలోని శివాలయంలో శనివారం శివపార్వతుల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు గోసుల సుబ్బారెడ్డి, గుత్తి రెడ్డి గంగిరెడ్డి ఆధ్వర్యంలో కల్యాణాన్ని పండితులు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ ప్రజలు జి. రాజగోపాల్ రెడ్డి, జి. సుబ్బారెడ్డి, చిన్ని రెడ్డి, శ్రీమంతు రెడ్డి, నరసింహతో పలువురు పాల్గొన్నారు.

పంచలింగాల సన్నిధిలో మేయర్

కడప కార్పొరేషన్: సిద్దవటం మండలంలోని నిత్యస్వామి కోనలో పంచలింగాలను కడప మేయర్ కె. సురేష్ బాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అపూర్వ, ఆదిత్య కళ్యాణ మండపాల డెకరేషన్ నిర్వాహకులు కంటా బ్రదర్స్ మహేష్, ప్రసాద్, సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించారు. సీఐ పురుషోత్తం రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామలక్ష్మణ్‌రెడ్డి, అనిల్ ప్రవీణ్, సాయి, మణికంఠ రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, నిర్వాహకులు నాగరాజు, ఎల్లారెడ్డి, అంకిరెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

2వ డివిజన్‌లో.... మహా శివరాత్రి సందర్భంగా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నగర అధ్యక్షులు ఎం. రాజగోపాల్‌రెడ్డి, 2వ డివిజన్ కార్పొరేటర్ సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో నానాపల్లె వద్దనున్న ఊరకొండ మల్లికార్జున స్వామి ఆలయం నందు మేయర్ సురేష్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నదానం : కడప నగర శివార్లలోని 2వ డివిజన్‌లో వెలసిన మల్లికార్జున స్వామి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నగర అధ్యక్షుడు ఎం. రాజగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ప్రారంభించారు. అనంతరం కొండాయపల్లెలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో డిప్యూటీ సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామనపల్లెలోని శివాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



బ్రహ్మకుమారీల నగరశాఖ కార్యాలయంలో శివజ్యోతిని వెలిగిస్తున్న గీతాబెహన్, ఇతర అతిథులు



నిత్యపూజస్వామి కోనలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ సురేష్ బాబు



2వ డివిజన్‌లోని మల్లికార్జునస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



శ్రీ విజయదుర్గాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రయాణికులతో బస్టాండు కిటకిట



శైవ క్షేత్రాలకు వెళ్లే బస్సుల వద్ద భక్తుల రద్దీ

కడప కోటిరెడ్డిసర్కిల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండు కిటకిటలాడింది. ఆర్టీసీ అధికారులు గోపాల్‌రెడ్డి, డిల్వేశ్వర్‌రావు ఏర్పాట్లను పరిశీలించారు. పొలతల, నిత్యపూజకోనలకు బస్సులను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కడప రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీ సీఐలు గోవర్ధన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీలత, యూనియన్ నాయకులు ఏఆర్ మూర్తి, శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గమల్లేశ్వర ఆలయంలో శనివారం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. శివపార్వతుల కల్యాణాన్ని ఆలయ కమిటీ సభ్యులు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలను సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్‌రామాంజులురెడ్డి ప్రారంభించి విజేతలకు బహుమతులను అందజేశారు.

చెన్నూరు: మండలంలోని శివాలయాలు, పెన్నానది ఒడ్డున వెలిసిన శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. టంగ్రురోడ్డులోని నాగేశ్వరస్వామి ఆలయం, ఉప్పరపల్లె గ్రామంలో ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయం, శివాలపల్లి పరిధిలో ఉన్న కాశీ విశ్వనాథస్వామి ఆలయం, బలసింగాయపల్లె గ్రామ పరిధిలో ఉన్న కైలాసగిరి సిద్ధ లింగేశ్వర స్వామి ఆలయం, కొండపేట గ్రామంలో ఉమామహేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. రామనపల్లి గ్రామంలో ఉన్న శివాలయం, కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో శివపార్వతులకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రామనపల్లె శివాలయంలో ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమబాబుతో కలిసి ఆర్టీసీ చైర్మన్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కమలాపురం : మండల పరిధిలోని టి.చదిపిరాళ్లలో వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణం జరిగింది. శనివారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సగిలి వెంకటసుబ్బారెడ్డి, పావని దంపతులు కల్యాణ దంపతులుగా వ్యవహరించారు.భక్తులు కనులారా స్వామి వార్ల కళ్యాణాన్ని వీక్షిస్తుండగా మంత్రోచ్ఛారణలతో పురోహితులు అమ్మవారికి మాంగల్య ధారణ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

చక్రాయపేట : స్థానిక శ్రీవేంకటేశ్వర, రాచరాయ స్వామి ఆలయాల్లో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివ పార్వతులు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పురోహితులు జగన్నాథశాస్త్రి, అనంతపద్మనాభ శర్మలు స్వామి వారి మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించారు.

బండలాగుడు పోటీల్లో సంజామల ఎద్దు ఫస్ట్

చక్రాయపేటలో నిర్వహించిన బండ లాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా సంజామలకు చెందిన గుండెం చెన్నారెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.50 వేలు, రెండవ బహుమతిని పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దులు రూ.40వేలు, మూడవ బహుమతిని వల్లూరు మండలానికి చెందిన పుల్లావుల సురేష్ ఎద్దులు రూ.30 వేలు, పోతి రెడ్డిపల్లెకు చెందిన చాగంరెడ్డి ఈశ్వరరెడ్డి ఎద్దులు నాలుగవ బహుమతి రూ.20 వేలు, ప్రొద్దుటూరుకు చెందిన అచ్చుకట్ల గౌస్‌బాషా ఎద్దులు ఐదవ బహుమతి రూ.10వేలు, ఆరవ బహుమతిని బ్రహయ్య ఎద్దులు రూ.5 వేలు నగదును గెలుచుకున్నాయి.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని నంగనూరుపల్లె గ్రామంలో నిర్మించనున్న కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతు సాయంగా రూ.30లక్షలు విరాళం ఇస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా శనివారం నంగనూరుపల్లె గ్రామంలోని శివాలయంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. అనంతరం కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. విశాలమైన మైదానంలో రూ.70లక్షలతో కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంకరయ్య యాదవ్, సర్పంచ్ లక్ష్మీదేవి వెంకటరాముడు, ఎంపీటీసీ క్రిష్టిపాటి సంధ్య మంజునాథ శర్మ, ఉపసర్పంచ్ గంగయ్య, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, తొగటవీరక్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రామచంద్రారెడ్డిని గెలిపించండి

ప్రొద్దుటూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంవీ.రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం అపుస్మా నాయకులు కె.దేవిప్రసాద్‌రెడ్డి, షఫీ, గురూజి భాస్కర్‌రెడ్డిలు విజ్ఞాన్, బ్రిలియంట్ స్కూళ్లలో ప్రచారం చేశారు. రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు.

విద్యుత్ తీగలు తగిలి చొప్ప దగ్ధం

రాజుపాళెం : మండలంలోని తొండలదిన్నె గ్రామానికి చెందిన చెన్నంగి పెద్ద వెంకటరాముడుకు చెందిన చొప్ప ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. ఆ గ్రామం నుంచి ప్రొద్దుటూరుకు ట్రాక్టర్‌లో చొప్పను తరలిస్తుండగా వెలవలికి వెళ్లే రహదారిలో విద్యుత్ ట్రమ్ము వద్ద ఉన్న లైన్లు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపకశాఖ అధికారులు వచ్చి మంటలను అదుపు చేశారు.రూ.30 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు

చలివేంద్రం ప్రారంభం

పోరుమామిళ్ల : స్థానిక ఆర్టీసీ బస్టాండులో శనివారం బద్వేలు ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్రీనివాసులు చలివేంద్రంను ప్రారంభించారు. కమ్మవారిపల్లెకు చెందిన జి.వి.రమణ సహకారంతో పసుపులేటి వెంకటమ్మ జ్ఞాపకార్థం టీచర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు.దంతవైద్యులు సునీల్‌కుమార్‌రెడ్డి, వెంగమాంబ స్కూల్ కరస్పాండెంట్ పుల్లపనాయుడు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



బ్రహ్మంగారిమఠం : పుర వీధుల్లో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు



బ్రహ్మంగారిమఠం : ఈశ్వరీదేవిమఠంలో పార్వతీ పరమేశ్వరులకు పంచామృతాభిషేకం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం వీరబ్రహ్మ సుప్రభాతం, నామసంకీర్తనం, ఉపనిషత్ పారాయణం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, బలిహరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం దీక్షాబంధనాలంకారోత్సవం, భజన చేశారు. సాయంత్రం కందిమల్లాయపుర సంస్థాన ఆస్థాన కవి నిగమాగమ కళాకోవిద డాక్టర్ పెదపాటి నాగేశ్వరరావు ఉపన్యాసం భక్తులకు ఆకట్టుకుంది. రాత్రి కల్యాణ మంటపంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తజనం కనులారా వీక్షించి తన్మయులయ్యారు. అనంతరం పాల రామాంజనేయులు భాగవతారు చెప్పిన హరికథా కాలక్షేపాన్ని భక్తశ్రద్ధలతో విన్నారు. నరనంది ఉత్సవం ఉత్సాహంగా సాగింది. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున ఏకాదశరుద్రాభిషేకం (జాగరణ) నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ, మఠం వారు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బి.మఠం దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి, పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వాముల కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీరభద్రస్వామి, వీరంభట్లయ్యస్వామి, దత్తాత్రేయ స్వామి, గోవిందస్వామి, వరదరాజులస్వామి, కందిమల్లాయపల్లె పుర ప్రజలు, మైదుకూరు డీఎస్పీ, రూరల్ సీఐ, ఖాజీపేట ఎస్ఐ, బి.మఠం ఏఎస్ఐ, పోలీసులు పాల్గొన్నారు.

శ్రీ ఈశ్వరీదేవిమఠంలో..

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం పక్కనే ఉన్న జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రభాతసేవ, రుద్రాభిషేకం, సహస్రనామార్చన, స్వస్తి వాచక మంగళవాద్య పూర్వక యాగశాల ప్రవేశం, శ్రీ విఘ్నేశ్వరపూజ, స్వస్తి పుణ్యాహవచనం, అంకురారోపణం, దీక్షాకంకణ ధారణం, అఖండస్థాపన, మండపారాధన, సర్వదేవతాహ్వానం, ధ్వజారోహణం, నూతన కల్యాణ మూర్తుల మంగళస్నానం, ఆవాహిత సర్వదేవతా షోడశోపచార ప్రత్యేక పూజలు, శాంతి హోమం, నైవేద్య, మంత్రపుష్ప, నీరాజన, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ పార్వతీపరమేశ్వరుల కల్యాణమూర్తుల తులాభారం వైభవంగా జరిగింది. హిందూ ధర్మ పరిరక్షణ సమితి జిల్లా సభ్యుడు చాపాడు వెంకటసుబ్బారెడ్డి చెప్పిన పురాణ కాలక్షేపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి శ్రీపార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు చెప్పిన హరికథా కాలక్షేపం భక్తులను అలరించింది. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున ఏకాదశ రుద్రాభిషేకం(జాగరణ) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వాములు, ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లె క్షేత్రంలో..

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది. మండలంతోపాటు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి వీరభద్ర స్వామి దేవాలయంలో వీరభద్రస్వామి, కేథారీశ్వరుడులను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ఈఓ శ్రీనివాసులు, చైర్మన్ జీటీ వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు. శ్రీ వీరభద్ర స్వామి అన్నసత్రం, సర్వజన అన్నసత్రం, ఆర్యవైశ్య అన్న సత్రాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ కేసీ రాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్యాధికారి రాజేష్‌కుమార్, శ్రీవాణి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. తహసీల్దారు సుభానీ, మండల అధ్యక్షులు లక్షుమయ్య పర్యవేక్షించారు.

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయం, ఎర్రచెరువు వద్ద ఈశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిచారు. వనిపెంట రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని చిన్నయ్యగారిపల్లె వద్ద ఉన్న ముక్కొండ ముక్కంటీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నల్లమల అటవీ ప్రాంతంలోని భైరవ కోనలో భైరవేశ్వరస్వామి దేవస్థానంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

మల్లెంకొండకు పోటెత్తిన భక్తులు

గోపవరం : మండలంలోని మల్లెంకొండ భక్తులతో పోటెత్తింది. శుక్రవారం నుంచే కాలినడకన భక్తులు మల్లెంకొండకు చేరుకున్నారు. మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కొండపైన అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.